సాక్షి
వరంగల్
బుధవారం । 10 । సెప్టెంబర్ । 2025



అగ్నికణం ఐలమ్మ - 8లో▸

భూమి, భుక్తి, పేదల బతుకుల విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని రగిల్చిన అగ్నికణం చాలకి ఐలమ్మ. నేడు ఐలమ్మ వర్ధంతి.



చరిత్రలో నిలిచేలా నిర్మాణాలు

చరిత్రలో నిలిచేలా శాశ్వత నిర్మాణాలను చేపట్టేందుకు మేడారం మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు మంత్రి దనసరి సీతక్క తెలిపారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32^0 /23^0

జిల్లాలో ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కాళోజీకి ఘన నివాళి



న్యూశాయంపేట: ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి (తెలంగాణ తెలుగు భాషాదినోత్సవం)ని పురస్కరించుకుని మంగళవారం హనుమకొండ కాళోజీ జంక్షన్‌లోని కాళోజీ విగ్రహానికి కలెక్టర్ డాక్టర్ సత్యశారద పూలమాల వేసి నివాళులర్పించారు.

కేన్సర్ కేర్ సెంటర్ ప్రారంభం



నర్సంపేట రూరల్: నర్సంపేట పట్టణంలో సర్వాపురంశివారు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మంగళవారం కేన్సర్ కేర్ సెంటర్‌ను రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం నర్సంపేట వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మోహన్ దాస్, ఆస్పత్రి సూపరింటెండెంట్ కిషన్‌లు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు కేన్సర్ చికిత్సను సమీప ప్రాంతాల్లోనే అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కేన్సర్ చికిత్స నిమిత్తం హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్లాల్సి అవసరం లేకుండానే జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలోనే నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, ఆర్‌ఎంఓలు, వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



దేవేందర్



సమ్మయ్య

ఖానాపురం/రాయపర్తి: ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ టోర్నమెంట్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఖానాపురం మండలం బుధరావుపేట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు కంజర్ల దేవేందర్ బాస్కెట్ బాల్, రాయపర్తి మండలం కాట్రపల్లి ప్రభుత్వ పాఠశాల పీడీ పుట్ట సమ్మయ్య స్విమ్మింగ్‌లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిని పలువురు అభినందించారు.

ఎంజేఎస్ జిల్లా అధ్యక్షుడిగా రవి



గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ గొర్రెకుంటకు చెందిన సిలువేరు రవి మాదిగ జాగృతి సంఘం (ఎంజేఎస్) జిల్లా అధ్యక్షుడిగా నియమితులైనారు. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి బొల్లె సాంబయ్య నియామక ఉత్తర్వులు అందించారు. కాగా రవిని గొర్రెకుంటలోని బౌద్ధ అధ్యయన కేంద్రంలో ధర్మసమాజ్ పార్టీ, ఎంజేఎస్ ప్రతినిధులు సన్మానించారు.

15 రోజుల పాటు సేవా కార్యక్రమాలు



గీసుకొండ: ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్త పిలుపులో భాగంగా జిల్లాలో ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకు కార్యకర్తలు, నాయకులు పలు సేవా కార్యక్రమాలను చేపట్టాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు గడ్డమీద రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛభారత్, రక్తదానం, దివ్యాంగులకు, పేదలకు చేయూత అందించడం తదితర కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లా సేవాపక్షం కో కన్వీనర్లు కర్నె రవీందర్, కొంతం సంగీత్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్, నాయకులు వన్నాల వెంకటరమణ, బాకం హరిశంకర్, గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, ఏరుకుల రఘునాథ్‌రెడ్డి, గడల కుమార్, పోలెపాక మార్టిన్ లూథర్, కాసు శిల్ప, నాయకులు పాల్గొన్నారు.

లెక్క పక్కా!

- జిల్లాలో పంటల నమోదు తప్పనిసరి
- క్షేత్రస్థాయికి వెళ్లి నమోదు చేస్తున్న ఏఈఓలు
- అక్టోబర్ 25వ తేదీ తుదిగడువు
- రైతులు సహకరించాలంటున్న అధికారులు



గీసుకొండ: జిల్లాలో వానాకాలం పంటల నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. క్షేత్రస్థాయిలో మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓలు నేరుగా పంట పొలాల వద్దకు వెళ్లి ప్రత్యేకంగా రూపొందించిన డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్) యాప్‌లో సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. కొన్ని చోట్ల సర్వర్ సమస్యలు, ఇంటర్‌నెట్ లేని చోట ఆఫ్‌లైన్‌లో నమోదు చేసి అనంతరం ఆన్‌లైన్ చేస్తున్నారు. వీటితో పాటు రైతుల బ్యాంకు ఖాతా నంబర్లు, ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం, సెల్‌ఫోన్ నంబర్ తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియపై ఇప్పటికే అధికారులకు శిక్షణ ఇవ్వడంతో ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా ఉండాలనే ఉద్దేశంతో కార్యాచరణ రూపొందించారు. జిల్లాలో ప్రస్తుత వానాకాలంలో 1,30,376 ఎకరాల్లో వరి, 1,20,492 ఎకరాల్లో పత్తి, 17,094 ఎకరాల్లో మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నారు.

నమోదు కాకుంటే ఇబ్బందులు

రైతులు సాగు చేస్తున్న పంట పేరు, సాగు విస్తీర్ణం నమోదు చేసుకోకుంటే ఉత్పత్తులు విక్రయించే సమయంలో ఇబ్బందులు ఎదురవుతాయని అధికారులు హెచ్చరిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మిన తర్వాత ఆన్‌లైన్‌లో ఉన్న సాగు భూమికి సరిపడా దిగుబడి ఉండాలి. తేడాలుంటే నగదు చెల్లింపులు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఇలాగే నమోదు చేసుకోని రైతులు గతంలో ధాన్యం విక్రయించాక.. బిల్లులు రాక అధికారుల చుట్టూ తిరిగిన సందర్భాలు ఉన్నాయి. అలాగే ప్రభుత్వ పథకాలు, బీమా, పరిహారాల వంటివి పొందటానికి పంటల నమోదు తప్పనిసరి. రైతులకు సహాయం అందించటానికి ప్రభుత్వం దగ్గర పక్కా సమాచారం ఉంటుంది. పంట నష్టం జరిగినప్పుడు రైతులను ఆదుకోవడానికి, బీమా పథకాలను సజావుగా నిర్వహించడానికి పంటల నమోదు ముఖ్యమైంది.



మచ్చపురం శివారులో పంటల వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

ఏఈఓలదే బాధ్యత

జిల్లాలో 59 మంది ఏఈఓలు పని చేస్తున్నారు. వీరిలో ఒక్కొక్కరు సుమారు 1,800 నుంచి 2,000 ఎకరాల వరకు పంటల సాగు వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. వారి క్లస్టర్ల పరిధిలోని గ్రామాల్లో ఈ నమోదు కార్యక్రమం చేపడుతున్నారు. ఏఈఓలకు మొబైల్ యాప్‌ను కేటాయించి తెలంగాణ భూ నక్షా (కడస్ట్రాల్ మ్యాప్)ను యాప్‌తో లింక్ చేశారు. వారు రైతుల పొలం దగ్గరకు వెళ్లి భూ నక్షా యాప్‌ను ఆన్ చేయగానే ఆ ప్రాంతం 50 మీటర్ల పరిధిలోని సర్వే నంబర్లు కనిపిస్తాయి. రైతు పేరు, విస్తీర్ణం, ఆధార్ కార్డు, గ్రామం, ప్రస్తుత సాగు చేసే పంటల వివరాలను నమోదు చేస్తారు. కేటాయించబడిన సర్వే నంబర్లలో సాగు చేస్తున్న భూమి వివరాలే కాకుండా సాగు చేయని భూములు డిజిటలైజ్ అవుతున్నాయి. ఈ సర్వేలో జీలుగ వంటి పచ్చిరొట్ట పంటలను, వరిలో వివిధ సాగు పద్ధతులను, పలు పంటల విత్తనోత్పత్తి ప్రాంతాలను, పంట రకాలను రైతులు తప్పనిసరిగా ఏఈఓలకు అందించాలి. పంట విత్తిన కాలం నమోదు చేయడంతో పంట ఎప్పుడు కోతకు వస్తుందనేది అంచనా వేస్తారు. ఈ వివరాలు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు తోడ్పడుతాయి. అంతర పంటల సాగు వివరాలను సైతం యాప్‌లో నమోదు చేసే ఆప్షన్ ఉంది. పట్టాకాని భూముల్లో సాగు చేస్తున్న పంటల వివరాలను కూడా యాప్‌లో నమోదు చేసుకోవచ్చు.

అక్టోబర్ 25 లోపు నమోదు చేసుకోవచ్చు

అక్టోబర్ 25వ తేదీ లోపు పంటల వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఆ తర్వాత జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీల్లో పంటల నమోదు వివరాల జాబితా అక్టోబర్ 27న ప్రదర్శిస్తారు. ఈ జాబితాలో ఏమైనా తేడాలు, తప్పులు ఉంటే నవంబర్ 1 వరకు ప్రత్యేక దరఖాస్తు ఫారాల్లో ఏఈఓలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏఈఓలు సంబంధిత పొలాలను తిరిగి పరిశీలించి నవంబర్ 3 వరకు సవరణ చేస్తారు.

స్వచ్ఛందంగా నమోదు చేయించుకోవాలి

రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఏఈఓ వద్ద స్వచ్ఛందంగా నమోదు చేయించుకోవాలి. లేదంటే పంట ఉత్పత్తులు విక్రయించే సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అక్టోబర్ 25లోపు పంట నమోదుకు అవకాశం ఉంది. నవంబర్ 5న తుది జాబితాలను ఆయా గ్రామ పంచాయతీల వద్ద ప్రదర్శిస్తాం.

-హరిప్రసాద్ బాబు, ఏఓ, గీసుకొండ

జాతీయ రహదారిపై ధర్నా



నర్సంపేట రూరల్: ధర్నా నిర్వహిస్తున్న రైతులు, నాయకులు

నర్సంపేట రూరల్/రాయపర్తి: ఖరీఫ్‌లో రైతుల పంటలకు సకాలంలో యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని ఇటుకాలపల్లి గ్రామంలోని 365 జాతీయ రహదారిపై మంగళవారం రైతులు ధర్నా నిర్వహించారు. యూరియా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహారాములు, క్లస్టర్ ఇన్‌చార్జీ తాళ్లపెల్లి రాంప్రసాద్, మాజీ ఎంపీటీసీ భూక్య వీరన్న, పిట్టల శ్రీనివాస్, బుర్ర ఆనందం, రైతులు పాల్గొన్నారు. అలాగే రాయపర్తి మండల కేంద్రంతో పాటు పెర్కవేడు, తిర్మలాయపల్లి గ్రామాల్లో యూరియా కోసం టోకెన్లు ఇస్తున్నారని తెలుసుకున్న రైతులు తెల్లవారుజాము నుంచే బారులుదీరారు.



రాయపర్తి: పెర్కవేడులో బారులుదీరిన మహిళా రైతులు

ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి పాటుపడాలి

- తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ

హన్మకొండ: ఉమ్మడి వరంగల్ జిల్లా పునర్నిర్మాణంలో వేగం పెంచాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి పాటుపడాలన్నారు. మంగళవారం హనుమకొండ అదాలత్ కూడలిలోని రాచకొండ ప్రవీణ్ నివాసంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఉమ్మడి రాష్ట్రంలో వలస పాలకుల వివక్షకు గురికాగా, స్వరాష్ట్రంలో కల్వకుంట్ల పాలకుల కుటుంబ ప్రయోజనాల కోసం వరంగల్ జిల్లాను ముక్కలు చెక్కలు చేసి తీవ్ర విధ్వంసం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేస్తామని ప్రకటించిన మేరకు వరంగల్, హనుమకొండ జిల్లాలను ఒకే వరంగల్ జిల్లాగా ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా రూ.6,000ల కోట్ల అభివృద్ధి నిధులను సమకూర్చి అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, మామునూరు ఎయిర్‌పోర్టు, ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు త్వరితగతిన అమలు చేయాలన్నారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక కోఆర్డినేటర్ సోమ రామమూర్తి, ఆయా సంఘాల నాయకులు రాచకొండ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

నేడు రోబోటిక్స్ వర్క్‌షాప్

నర్సంపేట: నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్ర విభాగం హైదరాబాద్‌కు చెందిన సోహం అకాడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ భాగస్వామ్యంతో నేడు (బుధవారం) రోబోటిక్స్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మల్లం నవీన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం రోబోటిక్ బ్రోచర్‌ను వర్క్‌షాప్ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థుల నుంచి ఎంపిక చేసిన 40 మందికి 21 ప్రాక్టికల్ రోబోటిక్ ప్రయోగాల ద్వారా ప్రత్యక్ష శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు భవిష్యత్ వర్క్‌షాప్‌లకు శిక్షకులుగా, మెంటార్లుగా ఉంటారన్నారు. బీఎస్సీ(ఫిజికల్ సైన్సెస్), బీఎస్సీ (లైఫ్ సైన్సెస్), బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్) ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు అర్హులన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఎ) నర్సంపేట విద్యార్థులకు ఈ వర్క్‌షాప్ ఉచితమన్నారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ కన్వీనర్ భౌతిక శాస్త్ర అధ్యాపకులు బైరి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ కందాల సత్యనారాయణ, ఆర్.రుద్రాణి, డాక్టర్ పూర్ణచందర్, అడ్వైజరీ కమిటీ సభ్యులు ఎంఎంకె రహీముద్దీన్, ఎం.సోమయ్య, ఎస్.కమలాకర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



రోబోటిక్స్ వర్క్‌షాప్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

ప్రభుత్వ ఆదేశాలను అనుసరిస్తాం

ఖిలా వరంగల్: జిల్లాలోని 509 రేషన్ దుకాణాల్లో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం తరలింపునకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు జారీ కాలేదని, ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి తరలింపుకు చర్యలు తీసుకుంటామని అదనపు జిల్లా కలెక్టర్ సంధ్యారాణితోపాటు జిల్లా పౌర సరఫరాల అధికారి తెలిపారు. 'సాక్షి'లో దొడ్డు బియ్యం ఎలుకల పాలు అనే శీర్షికతో ఈనెల 6న ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. జిల్లా వ్యాప్తంగా 509 రేషన్ షాపుల్లో దొడ్డు బియ్యం నిల్వ ఉన్నాయని, ప్రభుత్వ ఆదేశాల మేరకు బియ్యం తరలింపునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సాక్షి స్పందన

నల్లా పన్ను బకాయిలు వసూలు చేయాలి

- అధికారుల సమీక్షలో నగర మేయర్ గుండు సుధారాణి

వరంగల్ అర్బన్: నల్లా పన్నుల బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఆర్‌ఓలు, ఆర్‌ఐలతో నల్లా పన్ను బకాయిల వసూళ్లపై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నల్లా బకాయిల వసూళ్ల లక్ష్యం రూ.45 కోట్లు ఉందని తెలిపారు. ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి వసూలు చేయాలని పేర్కొన్నారు. గత సంవత్సరం కంటే ఈసారి సుమారు 12 శాతం అధిక లక్ష్యాన్ని సాధించాలని సీడీఎంఏ నుంచి ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. పెద్ద మొత్తంలో బకాయి ఉన్న 150 మంది జాబితా తయారు చేయాలని సూచించారు. అదనపు కమిషనర్ చంద్రశేఖర్, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ఆర్ఓ లు షెహజాది బేగం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుధారాణి

విగ్రహాల అమ్మకాలు నిషేధం..

రోడ్ల పక్కన దేవతామూర్తుల విగ్రహాల అమ్మకాలు నిషేధమని అదనపు కమిషనర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నందున బల్దియా పరిధిలో రోడ్ల పక్కన దేవతామూర్తుల విగ్రహాలు అమ్మడం నిషేధమని పేర్కొన్నారు. వరంగల్ నగరానికి సంబంధించి ఉర్సు రంగలీల మైదానం, హయగ్రీవాచారి గ్రౌండ్ ప్రాంతాల్లో అమ్మకాలు జరుపుకోవాలని తెలిపారు.

మెరిట్ ప్రకారం సీట్ల భర్తీ

న్యూశాయంపేట: జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఐదు నుంచి 9వ తరగతిలో ఉన్న ఖాళీలను ప్రవేశ పరీక్ష రాసిన మెరిట్ లిస్ట్‌లో ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసి సీట్లను భర్తీ చేస్తామని సాంఘిక సంక్షేమ గురుకులాల సమన్వయ అధికారి పి.అపర్ణ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ హాల్‌టికెట్‌తో పాటు ఒరిజినల్ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 12న వరంగల్ జిల్లా పరిధి రాయపర్తి మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకులంలో హాజరు కావాలన్నారు. అదే రోజు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఎస్సీ కేటగిరీ వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు.

అంగన్‌వాడీల్లో 'పోషణ్ వాటిక'

- జిల్లాలోని 54 కేంద్రాల్లో కూరగాయల సాగు
- ఉద్యానశాఖ అధికారుల సహకారంతో పనులు
- లబ్ధిదారులకు సంపూర్ణ పౌష్టికాహారం అందించే దిశగా అడుగులు
- తప్పనున్న కూరగాయల కొనుగోలు బాధ

సాక్షి, వరంగల్: అంగన్‌వాడీల్లో పోషణ్ వాటిక అమలుకు జిల్లా సంక్షేమ విభాగాధికారులు సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య బోధించడంతో పాటు పోషకాహారం అందిస్తున్నా... వారికి సంపూర్ణ పౌష్టికాహారం అందించే దిశగా అడుగులు వేస్తున్నారు. తొలుత జిల్లాలోని 54 కేంద్రాల్లో కూరగాయల తోటలు పెంచేందుకు ఉద్యానశాఖ అధికారుల మార్గదర్శనంలో ముందుకెళ్తున్నారు. ఈ మేరకు జిల్లా సంక్షేమ విభాగాధికారి రాజమణి సంబంధిత సీడీపీఓలతో పాటు ఉద్యానశాఖ అధికారులకు లేఖలు పంపిస్తున్నారు. తొందరగా ఇది అమలుచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కోకేంద్రానికి మంజూరైన రూ.పది వేలతో మైదానం చదును చేయడంతో పాటు సారవంతమైన మట్టి, ఎరువు కోసం ఖర్చు చేయనున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన కూరగాయలు పండించి అదే కేంద్రాల్లో తయారు చేసే వంటకాల్లో వినియోగిస్తారు. తొలి విడతలో టమాటా, వంకాయ, బెండ, ముల్లంగి, బీరకాయ, గోంగూర, పాలకూర, తోటకూర, మెంతికూరలను పండించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వీటి విత్తనాలను జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ పంపిణీ చేయనుంది. జిల్లా ఉద్యానశాఖ అధికారులు ఆయా కేంద్రాలను సందర్శించి సాగుకు అవసరమైన సౌకర్యాలు కల్పించి మొక్కల పెంపకాన్ని పర్యవేక్షించనున్నారు. దీంతో అందరికీ ఆరోగ్యకరమైన ఆహారం అందనుంది.



జిల్లాలో 919 అంగన్‌వాడీలు

జిల్లాలో 919 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో సొంత భవనాలు 165, అద్దె భవనాలు 426, ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నవి 328 కేంద్రాలున్నాయి. 0 నుంచి ఆరేళ్ల చిన్నారులు 47,625 మంది ఉంటే, బాలింతలు 3,714 మంది, గర్భిణులు 5,415 మంది ఉన్నారు. వీరికి ప్రస్తుతం కూరగాయలు కొనుగోలు చేసి వంట తయారుచేసి అందిస్తున్నారు. నగర పరిధిలో అక్షయపాత్ర వంటి సంస్థలు లబ్ధిదారులకు రాయితీపై భోజన సదపాయం కల్పిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూరగాయల ధరలు పెరిగిన సందర్భంలో ప్రభుత్వం కేటాయించే నిధులు సరిపోవడం లేదు. దీంతో కొన్ని సందర్భాల్లో ఆరోగ్యకరమైన ఆహారం అందక ఇబ్బంది పడిన సందర్భాలున్నాయి. వీటిని గుర్తించిన ప్రభుత్వం సేంద్రియ పద్ధతి సాగు ద్వారా ఆకుకూరలు వారే పండించుకొని వంటకాల్లో ఉపయోగించడం ద్వారా ఎక్కడా లోటుపాట్లు ఉండవని గుర్తించి ఆ దిశగా తొలుత జిల్లాలోని 54 అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5,40,000లు మంజూరు చేసింది.

దశల వారీగా అమలు చేస్తాం..

అంగన్‌వాడీల్లో తొలుత రూ.10 వేలతో పోషణ్ వాటికలను అభివృద్ధి చేస్తున్నాం. వీటితో పాటు రూ.16 వేలతో ఇంకుడుగుంతలు, రూ.39 వేలతో చిన్నారులకు ఆట వస్తువులు, రూ.25 వేలతో ఎల్‌ఈడీ స్క్రీన్లు, రూ.10 వేలతో తాగునీటి యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు రూపొందించి రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ శాఖకు పంపించాం. జిల్లాలో తొలుత 54 కేంద్రాల్లో పోషణ్‌వాటికను అమలు చేస్తున్నాం. ఆ తర్వాత దశల వారీగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో బలోపేతం చేస్తాం.

- రాజమణి, జిల్లా సంక్షేమ విభాగాధికారి

సమయపాలన పాటించాలి



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

ఎంజీఎం: సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని హనుమకొండ జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య సూచించారు. లష్కర్ సింగారం పీహెచ్‌సీ పరిధిలో టీబీ చికిత్స పొందుతున్న వారికి దాతల సహకారంతో పోషకాహార కిట్లను మంగళవారం డీఎంహెచ్ఓ అందించారు. ఈ సందర్భంగా పోషకాహార కిట్లను అందించిన దాతలను ఆయన అభినందించారు. అనంతరం పీహెచ్‌సీ పరిధిలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని సందర్శించి చికిత్స కోసం వచ్చిన రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. వాజ్‌పేయి కాలనీలో డ్రై డే కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం శాయంపేట పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా క్లినిక్‌ను సందర్శించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్మోహన్‌రావు, జిల్లా టీబీ నియంత్రణాధికారి డాక్టర్ హిమబిందు, వైద్యాధికారులు హైదర్, మౌనిక, అశోక్‌రెడ్డి, బాబు పాల్గొన్నారు.

ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ సందర్శించిన సీపీ

రామన్నపేట: నగరంలోని ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ మంగళవారం సందర్శించారు. స్టేషన్‌కు చేరుకున్న సీపీకి మొక్క అందించి సిబ్బంది గౌరవ వందనంతో ఆహ్వానించారు. అనంతరం సీపీ స్టేషన్ పరిసరాలను పరిశీలించి శుభ్రత, భద్రతా ఏర్పాట్లతోపాటు సిబ్బంది విధి నిర్వహణపై సమీక్షించారు. స్టేషన్ రిసెప్షన్ సిబ్బంది పనితీరు, కేసుల నమోదు వివరాలను పరిశీలించారు. అదే విధంగా స్టేషన్ పరిధిలో ముఖ్యమైన కేసులు, కాలనీల పరిస్థితులు, రౌడీషీటర్ల జాబితా తదితర వివరాలను స్టేషన్ ఇన్‌స్పెక్టర్ షకూర్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో మరింత సమన్వయంతో వ్యవహరించి, ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేయాలని సీపీ సూచించారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్‌సలీమా, ఏఎస్పీ శుభమ్, సిబ్బంది పాల్గొన్నారు.



స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

12 నుంచి కేయూ వీసీ అమెరికా పర్యటన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి ఈనెల 12 నుంచి 20వ తేదీవరకు అమెరికా అధికార పర్యటన చేస్తారని రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం మంగళవారం తెలిపారు. అమెరికాలోని న్యూజెర్సీ అట్లాంటాలో నిర్వహించనున్న కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కాలేజీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. యునైటెడ్ స్టేట్స్ ఫార్మసీ విభాగం చాప్టర్ సమ్మేళనంలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, టెక్సాస్‌లోని ఏ అండ్ ఎం యూనివర్సిటీకి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మకాలజీ అండ్ న్యూరో థెరిప్యూటిక్స్‌తో ఒక అవగాహన ఒప్పందం కూడా కుదుర్చుకుంటారని ఆయన తెలిపారు. ఈ ఒప్పందం విద్య, పరిశోధన రంగాల్లో అంతర్జాతీయ సహకారానికి దోహదం చేస్తుందని భావిస్తున్నట్లు వివరించారు. రెండు విశ్వవిద్యాలయాల మధ్య పరిశోధనల మార్పిడి మరింతగా సులభతరం అవుతుందని తెలిపారు.

క్లుప్తంగా



న్యూఢిల్లీలో మంగళవారం నిర్వహించిన ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకుంటున్న వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య

కేయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ,అధికారులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ ఫైనలియర్‌లో ఒక్క సబ్జెక్టులో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈనెల 2న ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించారు. కాగా మంగళవారం బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ ఇన్‌స్టంట్ పరీక్ష ఫలితాలను వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి విడుదల చేశారు. 83శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె.రాజేందర్ తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. కాకతీయ.ఏసీ.ఇన్‌లో ఫలితాలు చూసుకోవచ్చని పేర్కొన్నారు. అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ పి.వెంకటయ్య, ఎం.తిరుమలాదేవి, దూర విద్యాకేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సురేష్‌లాల్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



సాయికుమార్ (ఫైల్)

దంతాలపల్లి : మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన అల్లం సాయికుమార్ (29) కొంతకాలంగా మానసిక సమస్యతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో సాయికుమార్ తీవ్ర మనస్తాపానికి గురై సోమవారం గడ్డిమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు, స్నేహితులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. సాయికుమార్ 18 సంవత్సరాల నుంచి బీజేపీలో కొనసాగుతున్నాడు. అతడి మృతి పట్ల బీజేపీ నాయకులు, ప్రముఖులు సంతాపం తెలిపారు.

రైలు కింద పడి యువకుడి..



సాయిరమణ (ఫైల్)

ఖిలా వరంగల్: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వరంగల్ జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సుదర్శన్ కథనం ప్రకారం.. మహారాష్ట్ర చంద్రాపూర్ జిల్లా గాంధీనగర్ గూగుజీకు చెందిన పోలు సాయిరమణ (23) హనుమకొండలోని రాంనగర్‌లో గదిని అద్దెకు తీసుకొని ఎంబీఏ రెండో సంవత్సరం చదువుతున్నాడు. వ్యక్తిగత కారణాలతో జీవితంపై విరక్తి చెందిన సాయిరమణ వరంగల్ చింతలపల్లి రైల్వే స్టేషన్ సమీపాన రైలు కిందపడి మంగళవారం తెల్లవారుజామున ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఘటనా స్థలం నుంచి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన తండ్రి తిరుపతికి సాయిరమణ మృతదేహాన్ని అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ సురేందర్ తెలిపారు.

అగ్నికణం ఐలమ్మ

- భూస్వాములు, రజాకార్లను తరిమికొట్టిన వీరనారి
- దేశ్‌ముఖ్‌లకు ముచ్చెమటలు పట్టించిన ధీశాలి
- నేడు చాకలి ఐలమ్మ వర్ధంతి



విస్నూరు దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి గడి



చాకలి ఐలమ్మ (ఫైల్)

పాలకుర్తి టౌన్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో చిట్యాల ఐలమ్మ పాత్ర వీరోచితమైనది. ఆమె జీవితం ఇప్పటికీ అనేక పోరాటలకు ప్రేరణగా నిలుస్తోంది. భూమి, భుక్తి, పేదల బతుకుల విముక్తి కోసం సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని రగిల్చిన అగ్నికణం చాకలి ఐలమ్మ. అనేక మందికి విప్లవభావాలు మండించిన నిప్పుల కొలిమి ఐలమ్మ. విస్నూర్ దొర రాపాక రాంచంద్రారెడ్డి ఆగడాలపై అగ్నికణంలా మారి ముందుకు దూంకిన తొలి వీరనారి చాకలి ఐలమ్మ. తన పంటపొలాల్లో పండించిన ధాన్యం విషయంలో ప్రారంభించిన ఉద్యమం యావత్ తెలంగాణ జిల్లాలకు వ్యాపించింది. రాంచంద్రారెడ్డికి వ్యతిరేకంగా ఎర్రజెండాను చేతపట్టి ప్రజలను సమీకరించి సాగించిన పోరాటం ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. ఐలమ్మ తన చాకలి వృత్తిలో ఆర్థికంగా నిలదొక్కు కోలేకపోయింది. దీంతో కుటుంబీకులు మల్లంపల్లి జమీందార్ ఉత్తంరాజు కొండల్‌రావు దగ్గర 40 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. దేశ్‌ముఖ్ ఏజెంట్ అయిన పాలకుర్తి పోలీసు పటేల్ వీరమనేని శేషగిరిరావు గ్రామంలో పెత్తనం చెలాయిస్తూ వెట్టి చేయించుకునే వాడు. ఓ రోజు పోలీస్ పటేల్ ఐలమ్మను, ఆమె భర్త నర్సయ్యను పశువులతో సహా వచ్చి తన వ్యవసాయ పొలంలో పనిచేయాలని ఆదేశించారు. అప్పటికే ఆంధ్ర మహాసభలో చేరిన ఐలమ్మ కుటుంబంపై కక్షగట్టి ఆంధ్ర మహాసభల్లో చేరిందని, నాయకులకు ఆశ్రయం కల్పించి అన్నం పెడుతోందని ఆరోపిస్తూ దాడులు చేయించారు. ఐలమ్మ భర్త నర్సయ్య, సంఘం నాయకులు ఆరుట్ల రాంచంద్రారెడ్డి, బీంరెడ్డి నర్సింహరెడ్డి, నల్లా నర్సింహులు, నల్లు ప్రతాప్‌రెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వర్‌రావును తీసుకు వచ్చారు. పాలకుర్తి తదితర ప్రాంతాల్లో జరిగిన కొన్ని సంఘటనల్లో ఐలమ్మ, ఆమె భర్త నర్సయ్య, కుమారుడు సోమయ్య, లచ్చయ్యపై రాంచంద్రారెడ్డి కుట్ర కేసు పెట్టి జైలుకు పంపాడు. మల్లంపల్లి జమీందార్ కొండల్‌రావును దేశ్‌ముఖ్ పిలిపించి ఐలమ్మకు కౌలుకు ఇచ్చిన భూమిని తనకు కౌలుకు ఇచ్చినట్లుగా ఒక అగ్రిమెంట్ రాయించుకుని దానిని ఆధారంగా చేసుకుని ఐలమ్మ పంటను ధ్వంసం చేసేందుకు గుండాలను పంపించాడు. ఐలమ్మ పొలంలోని పంటను కాపాడుకునేందుకు బీంరెడ్డి నర్సింహారెడ్డి నాయకత్వంలో పార్టీ కార్యకర్తలు, గుండాలను అడుగు పెట్టనియ్యకుండా ప్రతిఘటించారు. ఐలమ్మ కుటుంబానికి ఆంధ్రమహాసభ అండగా నిలిచింది. ఐలమ్మ పోరాటం గురించి తెలుసుకున్న పుచ్చలపల్లి సుందరయ్య ఆమె ఇంటికివచ్చి ఇల్లునే కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంగా మార్చి ఇంటి ఆవరణలో అరుణపతాకాన్ని ఎగురవేశారు. 'ఐలమ్మ భూస్వామ్య వ్యవస్థపై తిరుగుబాటుకు చిహ్నంగా నిలిచిందని' పుచ్చలపల్లి సుందరయ్య కొనియాడారు.



పాలకుర్తి రాజీవ్ చౌరస్తాలో ఐలమ్మ విగ్రహం

ఐలమ్మ జీవితం..

ఐలమ్మ 1895 సెప్టెంబర్ 26వ తేదీన రాయపర్తి మండలంలోని కిష్టాపురం గ్రామంలో జన్మించింది. పాలకుర్తికి చెందిన చిట్యాల నర్సయ్యతో 1908లో తన 13వ యేటా వివాహం జరిగింది. వృద్ధాప్యంతో 90 ఏళ్ల వయస్సులో 1985, సెప్టెంబర్ 10న ఐలమ్మ కన్నుమూసింది. ఆమె పోరాటానికి చిహ్నంగా మండల కేంద్రంలో ఐలమ్మ స్మారక స్థూపం, భవనం, కాంస్య విగ్రహం నిర్మించారు.

చాకలి ఐలమ్మ పేరుతో స్మృతివనం ఏర్పాటు చేయాలి

హైదరాబాద్ సచివాలయం ఎదుట, ఢిల్లీ పార్లమెంట్‌లో ఐలమ్మ విగ్రహం పెట్టాలని, ఏదైనా జిల్లాకు ఐలమ్మ పేరు పెట్టాలని పలువురు కోరుతున్నారు. పాలకుర్తి మండల కేంద్రంలో ఐదెకరాల్లో ఐలమ్మ పేరుతో పార్కు, స్మృతివనం ఏర్పాటు చేయాలని ఐలమ్మ అభిమానులు కోరుతున్నారు.

చరిత్రలో నిలిచేలా గద్దెల నిర్మాణాలు

- సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క
- మేడారంలో అభివృద్ధి పనుల పరిశీలన



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన కలెక్టర్, ఎస్పీ

ఎస్ఎస్‌తాడ్వాయి : మేడారం సమ్మక్క–సారలమ్మల కీర్తిప్రతిష్ఠను నిలబెడుదామని, వందేళ్ల అమ్మవార్ల చరిత్ర నిలిచేలా శాశ్వత నిర్మాణాలను చేపట్టేందుకు మేడారం మాస్టర్ ప్లాన్ రూపొందించిన్నట్లు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క పేర్కొన్నారు. మంగళవారం మేడారంలోని ఐటీడీఏ అతిథిగృహంలో కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ డాక్టర్ శబరీశ్, పీఆర్‌శాఖ ఇంజనీరింగ్, దేవాదాయశాఖ, పూజారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుత మాస్టర్ ప్లాన్‌లో గద్దెల ప్రాంగణంలో చేపట్టనున్న అభివృద్ధి పనుల డిజైన్‌ను అర్కిటెక్ బృందం ప్రాజెక్టర్ ద్వారా చూపించారు. గద్దెల ప్రాంగణంలోని అభివృద్ధి పనుల ఏర్పాట్లపై సమీక్షించిన అనంతరం సీతక్క మాట్లాడారు. పూజారుల అభిప్రాయాలు, నిర్ణయాల మేరకు గద్దెల ప్రాంగణంలో మార్పులు చేర్పులు చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులను వంద రోజుల్లో పూర్తి చేయాలన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క

ఈనెల, 13,14వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి మేడారానికి వచ్చే అవకాశం ఉంది. దీంతో మంత్రి సీతక్క అధికారులతో కలిసి మేడారం వైజంక్షన్ సమీపంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద సీఎం సమావేశం నిర్వహణకు స్థలాన్ని పరిశీలించారు. శివరాంసాగర్ సమీపంలోని వీఐపీ రోడ్డును సీతక్క పరిశీలించి, వరద కోతతో పైపులు బయటికి కనిపించడంతో మరమ్మతులు చేయాలని ఆదేశించారు. సీఎం పర్యటన సందర్భంగా వచ్చే వీఐపీ, వీవీఐపీల విశ్రాంతి కోసం హరితహోటల్‌ను పరిశీలించి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, ఎస్పీ డాక్టర్‌తో చర్చించారు. అనంతరం అమ్మవార్లను మంత్రి సీతక్క దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవీందర్, ఈఓ వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, అర్కిటెక్ బృందం పాల్గొన్నారు.

పూజారుల అభిప్రాయాల స్వీకరణ

మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ స్థపతి, చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ శివనాగిరెడ్డి, అర్కిటెక్చర్ ఇంజనీరింగ్ అధికారులు, దేవాదాయశాఖ ఇంజనీరింగ్ అధికారులు, పూజారులు గద్దెల వద్దకు వెళ్లి మాస్టర్ ప్లాన్‌లో చేయాల్సిన మార్పులు,చేర్పులను అడిగి తెలుసుకున్నారు. నూతన సాలహారంపై ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయల చిత్రాలు, పడిగలను ఏర్పాటు చేయాలని పూజారులు వివరించారు. బుధవారం ఫైనల్ మాస్టర్ ప్లాన్ డిజైన్‌ను రూపొందించాలని శివనాగిరెడ్డి అర్కిటెక్ డిజైనర్ల బృందానికి సూచించారు.

ఎల్ఎల్‌బీ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈనెల 12న నిర్వహించాల్సిన ఎల్ఎల్‌బీ మూడేళ్ల కోర్సు రెండో సెమిస్టర్ (మూడో పేపర్) పరీక్షను వాయిదా వేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఆసిం ఇక్బాల్ తెలిపారు. అదేరోజు జరగాల్సిన ఐదేళ్ల లా కోర్సు ఆరో సెమిస్టర్ (మూడో పేపర్) పరీక్షను వాయిదా వేశామని తెలిపారు. ఆ రెండు పరీక్షలు ఈనెల 15న నిర్వహించనున్నామని వారు పేర్కొన్నారు.

కదంతొక్కిన లంబాడీలు



ర్యాలీలో నినాదాలు చేస్తున్న లంబాడీ జేఏసీ నాయకులు, లంబాడీలు

- హనుమకొండలో లంబాడీల ఆత్మగౌరవ శాంతిర్యాలీ
- అనుమతి లేదని అడ్డుకున్న పోలీసులు
- ఇరువర్గాల తోపులాట, స్వల్ప ఉద్రిక్తత
- ఠాణూ నాయక్ విగ్రహం వద్ద ధర్నా
- తమ ఎస్టీ హోదాను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే: లంబాడీ జేఏసీ

హన్మకొండ : లంబాడీలు ఆత్మగౌరవ శాంతి ర్యాలీతో కదం తొక్కారు. ఎస్టీ హోదా పరిరక్షణకు లంబాడీ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్రవ్యాప్తంగా ఆత్మగౌరవ ర్యాలీలకు పిలుపునిచ్చింది. ఈక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో మంగళవారం హనుమకొండ బాలసముద్రం ఏకశిలా పార్కు ఠాణూ నాయక్ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు లంబాడీలు ఆత్మగౌరవ ర్యాలీని నిర్వహించ తలపెట్టారు. ర్యాలీ ఉందనే సమాచారంతో పోలీసు బలగాలు అక్కడికి పెద్దఎత్తున చేరుకున్నాయి. బారికేడ్లు అడ్డుపెట్టి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా యువకులు, విద్యార్థులు, మహిళలతో పాటు లంబాడీలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఠాణూనాయక్ విగ్రహం నుంచి ర్యాలీ ప్రారంభం కాగానే పోలీసులు వారిని వారించారు. అనుమతి లేదని ఇక్కడి నుంచి కదలవద్దని సూచించారు. అయినా ఆందోళనకారులు పోలీసులను తోసుకుంటూ ముందుకెళ్లేందుకు యత్నించగా పోలీసులు ప్రతిఘటించారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట, వాగ్వాదం జరిగింది. దీంతో స్వల్ప ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు లంబాడీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులకు పరిస్థితులు వివరించి సర్దిచెప్పడంతో శాంతించారు. ఠాణూనాయక్ విగ్రహం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. కోయ, గోండులకు చెందిన కొద్దిమంది రాజకీయ నాయకుల వైఖరిని తీవ్రంగా నిరసిస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.

ఆ రాజకీయ నాయకులపై చర్యలు తీసుకోవాలి..

ఈ ర్యాలీ సందర్భంగా లంబాడీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ..లంబాడీలపై నిరాధార ఆరోపణలు చేస్తున్న కోయ, గోండు వర్గాలకు చెందిన రాజకీయ నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని లంబాడీలను రాజ్యాంగబద్ధంగా ఎస్టీ జాబితాలో చేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉందని, లంబాడీల ఎస్టీ రిజర్వేషన్లను కాపాడాల్సిన బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వానిదేని వారు పేర్కొన్నారు. లంబాడీలను నిర్లక్ష్యం చేసిన, సుప్రీంకోర్టులో లంబాడీల పక్షాన కేంద్ర.,రాష్ట్ర ప్రభుత్వాలు పోరాడకపోయినా స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ, రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో లంబాడీల వ్యతిరేకమైన పార్టీలను బొందపెడతామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. వెంటనే కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీ, కమ్యూనిస్టు పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. లంబాడీల శాంతి ర్యాలీకి జిల్లా యంత్రాంగం, పోలీసులు అనుమతి ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా నిరసించారు. కార్యక్రమంలో లంబాడీ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎల్–జేఏసీ) కన్వీనర్లు జాటోత్ కిషన్‌నాయక్, జైసింగ్ రాథోడ్, సమన్వయకర్త వి.ఎస్.నాయక్, నాయకులు రాజు నాయక్, అంగోత్ వినోద్, వాంకుడోత్ వీరన్న, పోరిక గోవింద నాయక్, వీరమ్మ, గోపిసింగ్, బానోత్ వసంత్ నాయక్, బానోత్ వెంకన్న నాయక్, డాక్టర్ ఉదయ్ సింగ్ నాయక్, సునావత్ జవహర్, బానోత్ మంగీలాల్, సమ్మయ్య రాథోడ్, లకావత్ కరుణాకర్, పాడియా గాంగు నాయక్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమలకు తగ్గిన విద్యుత్ బిల్లులు

- ఎల్‌టీ కేటగిరీ–3 నుంచి కేటగిరీ–4కు మార్పు
- యూనిట్ ధర రూ.7.70 నుంచి రూ.4కు తగ్గింపు



హన్మకొండ: కుటీర పరిశ్రమలపై విద్యుత్ బిల్లుల భారం తగ్గింది. తెలంగాణ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఎల్‌టీ కేటగిరీ–3 నుంచి ఎల్‌టీ కేటగిరీ–4కు కుటీర పరిశ్రమలను తీసుకొచ్చారు. దీంతో కుటీర పరిశ్రమ వినియోగదారులపై భారం తగ్గింది. 25 హెచ్‌పీ లోపు లోడ్ కలిగిన కుటీర పరిశ్రమలు ఈ కేటగిరీ–4లోకి వస్తాయి. 25 హెచ్‌పీ లోడ్‌కు పైన ఉన్న పరిశ్రమలు కేటగిరీ–3 కిందికి వస్తాయి. కేటగిరీ మారడంతో యూనిట్ చార్జీలు మారాయి. కేటగిరీ–3లో యూనిట్ చార్జీ రూ.7.70 ఉండగా కేటగిరీ–4లో యూనిట్ చార్జీ రూ.4గా ఉంది. అదే విధంగా ఫిక్స్‌డ్ చార్జీలు కిలో వాట్‌కు రూ.100 ఉండగా కేటగిరీ మార్పుతో రూ.20 తగ్గింది. యూనిట్ పరంగా చూస్తే రూ.3.70, కిలోవాట్ పరంగా రూ.80 భారం వినియోగదారులపై తగ్గింది. పవర్‌లూమ్స్, వడ్రంగి, కమ్మరి, కంచరి, గోల్డ్‌స్మిత్, శిల్పి, కొవ్వొత్తుల తయారీ, పాపడ్ లెదర్ వస్తువులు, చెప్పుల తయారీ, లాక్ టాయ్ మేకింగ్, పాప్ టాయ్స్, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ఉత్పత్తులు, బొమ్మల తయారీ పరిశ్రమలు, ఊరగాయల తయారీ, మామిడి జెల్లి యూనిట్లకు 25 కిలోవాట్లకు మించకుండా లోడ్ ఉన్న కుటీర పరిశ్రమలు మాత్రమే ఎల్‌టీ కేటగిరీ–3లోకి వస్తాయి.

కేటగిరీ మార్పు చేయించామని దళారుల వసూళ్లు..

ఇదిలా ఉండగా తామే కేటగిరీ మార్పు చేయించి బిల్లులు తగ్గించామని చెబుతూ కొందరు వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిసింది. ప్రధానంగా మడికొండ టెక్స్‌టైల్స్ పార్కు కేంద్రంగా కొందరు ఒక్కొక్కరి నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) కుటీర పరిశ్రమలపై భారం పడకుండా, కుటీర పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కేటగిరీ మార్పు ద్వారా భారం తగ్గిస్తే కొందరు ఇదే అదనుగా సొమ్ము చేసుకుంటున్నారు. కాగా, విద్యుత్ అధికారులు, సిబ్బంది పేరుతో ఎవరైనా వసూళ్లకు పాల్పడితే తమ దృష్టికి తీసుకురావాలని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి సూచించారు. విద్యుత్ నియంత్రణ మండలి తీసుకున్న ఈ నిర్ణయంతో ఇతరులకు సంబంధం లేదని స్పష్టం చేశారు. కేటగిరీ మార్పు కోసం ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దని సూచించారు. హనుమకొండ టౌన్ డివిజన్‌లోని 25 హెచ్‌పీకి తక్కువ లోడ్ ఉన్న కుటీర పరిశ్రమల వినియోగదారులు కేటగిరీ మార్పు, వివరాల కోసం డివిజన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు అందని జీతాలు

- 9వ తేదీ వచ్చినా రాని వేతనాలు?
- సబ్సిడీ రీయింబర్స్‌మెంట్ రాకపోవడమే కారణం
- సెలవుల్లో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఏ ఇద్దరు ఉద్యోగులు కలిసినా జీతాల ముచ్చటే.. 9వ తేదీ వచ్చినా ఇప్పటి వరకు రాలేదు.. ఎప్పుడొస్తాయో ఏమో.. అప్పులు తీసుకున్న చోట నెలసరి వాయిదాలు మీరుతున్నాయి.. ఈఎంఐ చెక్కులు బౌన్స్ అవుతున్నాయి.. అపరాధ రుసుం పడుతోంది.. ఏం చేయాలో అర్థం కావడం లేదంటూ విద్యుత్ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. టీజీ ఎన్పీడీసీఎల్‌లో 9వ తేదీ వచ్చినా జీతాలు రాకపోవడంపై ఉద్యోగుల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఆదాయం లోటు.. ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీ రీయింబర్స్‌మెంట్ సమయానికి అందకపోవడంతో జీతాల చెల్లింపులు నిలిచిపోయాయి. ప్రతి ఉద్యోగి తనకు వచ్చే ఆదాయాన్ని బట్టి ప్రణాళిక రూపొందించుకుంటారు. గృహరుణాలు, వాహన రుణాలు, పర్సన్ లోన్స్, చిట్టీలు, నెలవారి ఇంటి సరుకులు తెచ్చుకోవడం వంటివి ఇందులో ఉంటాయి. విద్యార్థులకు చెల్లించే ఫీజులుంటాయి. జీతాలు ఆలస్యం కావడంతో వీటి చెల్లింపులు గుదిబండగా మారాయని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. పెన్షనర్లు, అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్స్, ఆర్టిజన్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులకు టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం జీతాలు చెల్లించింది. ప్రొవిన్షియల్, అకౌంట్స్, ఇంజనీరింగ్, పీ అండ్ జీ ఉద్యోగులకు నిలిచిపోయాయి. చెక్కులు బౌన్స్ అయ్యాయని, ఆలస్యమైన కొద్ది అపరాధ రుసుం పెరుగుతోందని ఉద్యోగులు మొత్తుకుంటున్నారు. అధికారులు కూడా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నారు.

రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతోనే..

రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు ఇస్తున్న సబ్సిడీ మొత్తం ప్రతి ఏటా టీజీ ఎన్పీడీసీఎల్‌కు రూ.7 వేల కోట్లకు పైగా రీయింబర్స్‌మెంట్ చేస్తుంది. ఈ లెక్కన ప్రతి నెల రూ.590 కోట్లు చెల్లించాల్సి ఉంది. గత నెల రూ.300 కోట్లు మాత్రమే చెల్లించినట్లు సమాచారం. గత నెల మిగిలిపోయిన రూ.295 కోట్లు, ఈ నెల రావాల్సిన రూ.595 కోట్లు ప్రభుత్వం ఇప్పటి వరకు రీయింబర్స్‌మెంట్ చేయలేదు. దీంతో జీతాల చెల్లింపులు నిలిచిపోయాయని ఉద్యోగవర్గాలు చర్చించుకుంటున్నాయి. ప్రతి నెల వినియోగదారుల నుంచి వసూలు చేయడం ద్వారా వచ్చే ఆదాయం నుంచి పెన్షనర్స్, అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లు, ఆర్టిజన్లు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఉద్యోగులకు జీతాలు చెల్లించడంతోపాటు విద్యుత్ కొనుగోలుకు చెల్లింపులు చేశారు. విద్యుత్ కొనుగోలుకు ప్రతి నెల రూ.1000 కోట్లు వెచ్చిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి సెలవులో వెళ్లారు. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలపై ఆలోచించే అవకాశం లేకుండా పోయిందని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. దీంతో తమ జీతాలు ఎప్పటి వరకు వస్తాయోననే ఆందోళనలో ఉద్యోగులు కొట్టుమిట్టాడుతున్నారు.

సీఐఎస్ఎఫ్ జవాన్‌కు కన్నీటి వీడ్కోలు

- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



సెల్యూట్ చేస్తున్న అధికారులు



రమేశ్ పార్థివదేహంపై జాతీయజెండా కప్పి నివాళులర్పిస్తున్న జవాన్లు

చిట్యాల : మండల కేంద్రానికి చెందిన సీఐఎస్ఎఫ్ జవాన్ ఆరెపల్లి రమేశ్ (38) అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచాడు. అతడి పార్థివదేహాన్ని రాంనగర్ కాలనీలో తన ఇంటికి తీసుకువచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐఎస్ఎఫ్ జవాన్లు మంగళవారం గ్రామానికి చేరుకుని రమేశ్ భౌతికకాయంపై జాతీయ జెండా కప్పి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్ర సాయంత్రం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా శ్మశానవాటికలో రమేశ్ పార్థివదేహానికి సీఐఎస్ఎఫ్ ఆర్ఎస్సై భాస్కర్ (హైదరాబాద్), ఎన్టీపీసీ రామగుండం సీఐఎస్ఎఫ్ జవాన్లు తిరుపతిరావు, మనోజ్‌కుమార్ పాండే, గణేష్, శ్రీధర్, అనిల్‌కుమార్, గౌతమ్‌కుమార్ అధికార లాంఛనాలతో నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. మృతదేహంపై కప్పిన జాతీయ జెండాను అతడి భార్య మమతకు అప్పగించారు. రమేశ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అన్నారం బ్యారేజీలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



గడ్డం వెంకటేశ్ (ఫైల్)

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం అన్నారం బ్యారేజీలో నాటు పడవ నడుపుతూ వెళ్లి పియర్ (పిల్లర్)కు తగిలి గోదావరిలో గల్లంతైన గడ్డం వెంకటేశ్(46 మృతదేహం మంగళవారం లభ్యమైంది. కాళేశ్వరం ఎస్సై తమాషారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరొంచ తాలూకా మండలిపురానికి చెందిన ఇద్దరు మత్స్యకారులు గడ్డం వెంకటేశ్, తుముకూరి కృష్ణస్వామి మంచిర్యాల జిల్లా పొక్కూర్ వద్ద నాటు పడవ కొనుగోలు చేసి గోదావరి మీదుగా నడుపుకుంటూ సోమవారం అన్నారం బ్యారేజీ చేరుకున్నారు. అన్నారం బ్యారేజీ 11వ పియర్ వద్ద గేటు దాటే క్రమంలో ప్రవాహానికి ఒక్కసారిగా పడవ బోల్తాపడింది. దీంతో వెంకటేశ్ గోదావరిలో మునిగి గల్లంతు కాగా, కృష్ణస్వామి ఈదుకుంటూ బయటకు ప్రాణాలతో వచ్చాడు. రాత్రి వరకు పోలీసులు, జాలర్లు ఎంత వెలికినా ఆచూకీ లభ్యం కాలేదు. మంగళవారం మధ్యాహ్నం వెంకటేశ్ మృతదేహం లభ్యమైంది. కాళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో మృతుడి సోదరుడు గడ్డం లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహానికి మహదేవపూర్ సీహెచ్‌సీలో పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

స్కూల్‌వ్యాన్ డ్రైవర్ నిజాయితీ

- రూ.52 వేలు అప్పగింత



నగదు అప్పగిస్తున్న డ్రైవర్ ఆంజనేయులు

మహబూబాబాద్ రూరల్ : నగదుతో దొరికిన బ్యాగును బాధితుడికి అప్పగించి ఓ స్కూల్ వ్యాన్ డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు.మహబూబాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌కి చెందిన వ్యాన్ సోమవారం సాయంత్రం పిల్లలను ఇంటివద్ద వదిలేందుకు వేమనూరుకు వెళ్లింది. తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డుపై ఒక బ్యాగ్ కనిపించడంతో డ్రైవర్ పొదిల ఆంజనేయులు వ్యాన్‌ను నిలిపి దానిని తీసుకుని చూడగా అందులో రూ.52 వేల నగదు ఉంది. వెంటనే తీసుకువెళ్లి ఆ పాఠశాల కరెస్పాండెంట్ బూర పూర్ణచందర్‌కు తెలియజేశాడు. మంగళవారం వేమనూరు గ్రామంలో పిల్లల్ని తీసుకొచ్చేందుకు వెళ్లగా గ్రామస్తులకు దొరికిన బ్యాగ్ విషయం తెలియజేశాడు. సాయంత్రం వేమునూరు దగ్గరలో ఉన్న రాములు తండాకు చెందిన గుగులోత్ ప్రవీణ్ ఆ బ్యాగు తనదేనని పాఠశాలకు ఫోన్ చేసి చెప్పాడు. డైరెక్టర్ పూర్ణచందర్, ప్రిన్సిపాల్ హిమబిందు, డ్రైవర్ ఆంజనేయులు.. ప్రవీణ్‌కు రూ.52 వేల నగదు అప్పజెప్పారు. దీంతో ప్రవీణ్ ఆంజనేయులుని, యాజమాన్యానికి, సహకరించిన టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపాడు.

అధికార పార్టీ నాయకుడు, తహసీల్దార్‌పై కేసు

- ఉద్యోగి ఆత్మహత్యాయత్నం ఘటనపై పోలీసుల విచారణ

నల్లబెల్లి : ఉద్యోగి ఆత్మహత్యాయత్నం ఘటనలో అధికార పార్టీ నాయకుడు మాలోత్ చరణ్‌సింగ్, తహసీల్దార్ ముప్పు కృష్ణపై మంగళవారం కేసు నమోదు చేశారు. ఎస్సై గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం గుండ్లపహాడ్ శివారు బజ్జుతండాకు చెందిన వాంకుడోత్ కల్పన తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. అధికారి అండదండలతో బిల్‌నాయక్ తండాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు మాలోత్ చరణ్‌సింగ్ లైంగికంగా వేధిస్తూ, కార్యాలయానికి వస్తూ చంపుతానని ఆమెను బెదిరించేవాడు. ఈనెల 5న పలు తప్పుడు ఆరోపణలతో ఉద్యోగి కల్పనపై చరణ్‌సింగ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు మేడపల్లి మాజీ ఎంపీటీసీ భర్త మాలోత్ మోహన్ ఆమెకు వాట్సాప్ ద్వారా సమాచారం అందించాడు. చరణ్‌సింగ్ వేధింపులు, తప్పుడు ఆరోపణలపై కల్పన సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించింది. దీంతో నీకు ఎన్నిసార్లు చెప్పాలి, ఇప్పటికైనా చరణ్‌సింగ్‌తో బయట వ్యక్తిగతంగా మాట్లాడుకోవాలని తహసీల్దార్ దురుసుగా సమాధానం చెప్పి బయటకు వెళ్లగొట్టాడని ఎస్సై తెలిపారు. దీంతో మనస్తాపానికి గురైన కల్పన కార్యాలయంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలి భర్త ధూప్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.